ఇసుక దొరక్క.. ఇల్లు కట్టలేక..

- కుదేలవుతున్న నిర్మాణ రంగం
- గృహ నిర్మాణానికి ఆటంకాలు
- ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపు


మధ్యలోనే నిలిచిన ఇంటి నిర్మాణం


నస్రుల్లాబాద్‌లో పిల్లర్ల వద్దే నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఎలాంటి భవనం నిర్మించాలన్నా ముఖ్యంగా ఇసుక తప్పనిసరి. మండల పరిధిలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో గృహ నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. కామారెడ్డిలో ఉన్న మంజీరా నది పరివాహక ప్రాంతాలైన బీర్కూర్, పాతంగల్, కోటగిరి మండలాల్లో ఇసుక పుష్కలంగా లభిస్తుంది. ఈ ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందన్న ఉద్దేశ్యంతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిలిచిన ఇసుక రవాణా అనుమతులు నిలిచాయి. దీనితో ఇప్పటిదాకా అనుమతులు లేకపోగా అప్పట్లో ప్రారంభించిన గృహ నిర్మాణాలు పునాది స్థాయిలో ఆగిపోయాయి.

నెమ్మదించిన వ్యాపారాలు..

నిర్మాణ రంగంలో ముఖ్యంగా ఇటుక, ఇసుక, ఇనుము, సిమెంటు ముఖ్య పాత్ర వహిస్తాయి. అయితే ఇసుక అందకపోవడంతో నిర్మాణ రంగం కుదేలైంది. గత ప్రభుత్వ హయాంలో లభించిన ఇసుక ఇప్పుడు లభించడం లేదు. దీనితో ఇటుక బట్టీలు, సిమెంట్, ఇనుము వ్యాపారస్తులు గిరాకీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రూ. లక్షలు పెట్టుబడి పెట్టిన వ్యాపారాలు దిగాలు తీస్తున్నాయి.

మధ్యతరగతి వారికే ఇబ్బంది

బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న బీర్కూర్, దామరంచ, పాతంగల్, కోటగిరి, బరంగేడ్గి, కిష్టాపూర్ తదితర గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా అనుమతులు లేకపోవడంతో ఇంటి పనులు నిలిచాయి. దీంతో రాబోయే రోజుల్లో ముడి సరుకుల ధరలు ఆకాశాన్ని అంటనున్నాయి. గతంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.2000 ఉండగా త్వరలో అనుమతులు డిమాండ్ పెరిగి ధర పెరిగే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా ఇనుము, ఇటుక, సిమెంటు ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇసుక రవాణాలో ప్రభుత్వం చేపట్టే నూతన విధానం ఆలస్యం కారణంగా సామాన్యుడు ఇబ్బంది పడ్తాడు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు, అధికారులు స్పందించి బీర్కూర్ మండలంలోని మంజీరా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

మధ్యలో నిలిచిపోయాయి..



ప్రభుత్వ హామీల మేరకు ఇంటి నిర్మాణం ప్రారంభించాను. ఇసుక లేకపోవడంతో ఇంటి నిర్మాణం ఆగిపోయింది. అప్పుగా తెచ్చిన డబ్బులకు మిత్తులు కడుతున్నాం. అధికారులు, నాయకులు వెంటనే సామాన్యుని దృష్టిలో ఉంచుకుని ఇసుక ప్రారంభించాలి.

– మైశాగౌడ్, నస్రుల్లాబాద్

వంతెన పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న నాయకులు

దోమకొండ : దోమకొండ నుంచి కామారెడ్డి వెళ్లే ముత్యంపేట డబుల్ రోడ్డు పనులను శుక్రవారం జెడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్ పరిశీలించారు. ముత్యంపేట శివారులో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడారు. దోమకొండ నుంచి గొట్టిముక్కుల, లక్ష్మీదేవునిపల్లి, భిక్కనూరు వరకు రూ. 3 కోట్లు మంజూరైందని ఆయన పేర్కొన్నారు. పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని డీఈ పేర్కొన్నారు. అనంతరం జెడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్ మాట్లాడుతూ ముత్యంపేట మీదుగా డబుల్ రోడ్డు పనులు పూర్తయితే దోమకొండ, బీబీపేట, దుబ్బాక, మండలాల నుంచి ప్రయాణం సాగించే వారికి రోడ్డు మార్గం సులువుగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకబోయిన శ్రీనివాస్, కదిరే గోపాల్ రెడ్డి, నాగారపు రాములు, ముత్త గారి ముత్యం గౌడ్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయించుకోవాలి


ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎం దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్ : సీపీఐఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీలో రైతుల తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపి హత్య రాజకీయాలు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, ప్రకాష్, పరమేష్, అంబన్న, కిషోర్ తదితరులున్నారు.

తహసీల్ కార్యాలయం ముట్టడి


నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

మాచారెడ్డి : బీఎల్వోలుగా విధులు నిర్వర్తించిన అంగన్‌వాడీ టీచర్లకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పాల్వంచ తహశీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం గంటన్నర పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహించి మూడు నెలలు గడుస్తున్నా తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వకపోవడం విడ్డూరమని అంగన్ వాడీ టీచర్ల మండల కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్ర శేఖర్, అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా కన్వీనర్ బాబాయి ఆయా గ్రామాల అంగన్ వాడీ టీచర్లు ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని సాయినగర్ కాలనీలో మూడేళ్లుగా ఉన్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులు నూతనంగా 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరించారని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ట్రాన్స్‌కో లైన్‌ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మెన్ శశికాంత్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీచైర్మన్ బోయిని రాధ, రిటైర్డ్ ఎంఈవో పోచయ్య, నాయకులు విఠల్, శేఖర్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన



కామారెడ్డి అర్బన్ : పట్టణం దేవునిపల్లి ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి భూక్యా లోకేష్‌వర్మ అండర్–16 విభాగంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన 400 మీటర్ల పరుగులో పాల్గొని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాజట్టుకు ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ గంగాకిషన్, పీఈటీ పెద్ద పోతన్నగారి సంజీవ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెరవే రాష్ట్ర సభలకు తరలిరావాలి



కామారెడ్డి అర్బన్ : తెరవే రాష్ట్ర 8వ మహాసభలు ఈ నెల 25న ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతున్నందున కవులు, రచయితలు, మేధావులు, కళాకారులు హాజరుకావాలని తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కర్షక్ బీఎడ్ కళాశాలలో మాట్లాడారు.

రోడ్డు పనులు ప్రారంభం



భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ చిట్టెడి సుధాకర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతో ప్రభుత్వం ఈ నిధులు రూ. 10 లక్షలను మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్నల నాగరాజు, నేతలు పాల్గొన్నారు.

నియామకం



కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా రాణాప్రతాప్ రాథోడ్‌ను నియమించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు షబ్బీర్ అలీకి, రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకత్వానికి రాణాప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు.

సమాచారం..

నేడు మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలోని ఐకేపి కార్యాలయంలో ఈనెల 24వ తేదీన మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపి ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోదా బాయి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని సూచించారు.

నేడు గీతా ప్రవచనం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లి కృష్ణ మందిరం ఆలయంలో శనివారం గీతా ప్రవచనం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి మచాలే బాబ తెలిపారు. పవిత్ర మాఘ పౌర్ణమి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచల సిద్ధాంత తత్వ బోధకురాలు నారాయణమ్మ, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌లు హాజరవుతారన్నారు.

నర్సరీ తనిఖీ



భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామాన్ని ఎంపీడీవో సంతోష్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుధ్యపనులను, నర్సరిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు సాయగౌడ్, ఈవో లక్ష్మి, టీఏ రాజు ఫీల్డ్ అసిస్టెంట్ కొండల్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, ప్రైమరి స్కూల్‌ను గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఆయన వెంట సీడీసీ డైరెక్టర్ మల్లేశ్ మల్లారెడ్డి, గ్రామ కార్యదర్శి దయాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

- వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి


సదాశివనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : అభివృద్ధే లక్ష్యంగా గ్రామాభివృద్ధి కోసం పని చేస్తామని వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గడ్డమీది కాలనీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జగ్గ బాల్‌రాజు, సీనియర్ నాయకులు చిందం రాజయ్య, బాబ్జాని తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్ రావు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు శేఖర్, సంతోష్, రాము, వైద్యులు శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రవిపాటిల్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒడ్డెం సందీప్, పెద్ద పోతన్న గారి రాజేశ్, పెద్ద పోతన్న గారి శ్రీకాంత్, కుర్మ మనోహర్, వడ్ల ఆనందం లింగం, శంషాద్ పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట హైస్కూల్‌లో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వయంపాలన దినోత్సవంలో భాగంగా డీఈవోగా జస్వంత్, ఎంఈవోగా నిశాంత్, పాఠశాల హెచ్ఎంగా ఉదయ్‌కిరణ్ వ్యవహరించారు. వీరితోపాటు మరికొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటివిద్యార్థులకు పాఠాలను బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో స్వయంపాలన దినోత్సవం మరిచిపోలేనిరోజన్నారు. ఇదొక తీపిగుర్తుగా మిగిలిపోతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత ప్రతిమ, దివ్యసమాధి, పాదుకలను అలంకరించారు. శబరిమాత చిత్రపటం, పాదుకలను పల్లకీలో ఉంచి ఆశ్రమం ఆవరణలో భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం చేశారు.

నేడు సామూహిక వ్రతాలు

కామారెడ్డి అర్బన్ : పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 11గంటలకు స్థానిక శారదామాత ఆదిశంకర ఆలయంలో సామూహిక నవదుర్గా వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అలాగే దేవునిపల్లి శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతాలుంటాయని ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం అన్నదానం ఉంటుందని పేర్కొంది.

నేడు శివస్వాముల పడిపూజ

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో శనివారం శివస్వాముల సామూహిక పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శివస్వాములు తెలిపారు. భక్తులతో పాటు శివస్వాములు పడిపూజ కార్యక్రమానికి హాజరవ్వాలని నిర్వాహకులు కోరారు.

రేపు దేవునిపల్లిలో..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని గోవింద పరివార్‌లో ఈ నెల 25న శ్రీ మల్లిఖార్జున సిండికేట్ ఆధ్వర్యంలో మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురుస్వామి జమాల్‌పూర్ భూజంగ్‌రావు, అంబీర్ రాజేందర్‌రావు, పెద్దొళ్ల శిధర్ రావు, చిన్నోళ్ల రజనీకాంత్‌రావు తెలిపారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు కుంకుమ అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం మోతె గ్రామంలో చెరుకు కొట్టడానికి వచ్చిన మహిళా కూలీ జమున శుక్రవారం 108 అంబులెన్సులో ప్రసవించినట్లు 108 సిబ్బంది తెలిపారు. జమునకు పురిటి నొప్పులు రావడంతో భర్త ప్రేమ్‌సింగ్ 108 అంబులెన్సుకు కాల్ చేయగా వారు మోతె గ్రామానికి చేరుకొని మహిళను కామారెడ్డికి తరలిస్తుండగా తాడ్వాయి సమీపంలో నొప్పులు పెరగడంతో వాహనాన్ని పక్కన ఆపి డెలివరీ చేశారు. అనంతరం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. 108 సిబ్బంది ఈఎంటి కమలాకర్, పైలట్ ప్రకాష్‌గౌడ్‌లకు సదరు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కు అందజేత



పిట్లం(జుక్కల్) : మండలంలోని తిమ్మనగర్ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, సహకార సంఘం చైర్మన్ సాయిరెడ్డి లబ్ధిదారులికి రూ. లక్ష ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం సభ్యుడైన రైతు గొల్ల కృష్ణయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య గొల్ల కిష్టవ్వకు రూ. లక్ష జనత ఇన్సూరెన్స్ చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ వడగామ సాయిలు, డైరెక్టర్లు రామా గౌడ్, గంగారం, సీఈవో అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కోజీవాడిలో..



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని తుక్కోజీవాడి గ్రామంలో శుక్రవారం రైతుబీమా చెక్కును మాజీ సర్పంచ్ రాజమణి, ఎంపీటీసీ జయశ్రీలు బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామంలో ఇటీవల మరణించి సగును పెద్ద గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సంగారావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, భాస్కర్ రావు పాల్గొన్నారు.

ఘనంగా వశిష్ట కళాశాల వార్షికోత్సవం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని వశిష్ట జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం హాజరై మాట్లాడారు. కష్టపడి విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ఆకుల శ్రీనివాస్, హరిస్మరణ్‌రెడ్డి, బాలాజీరావు తదితరులున్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి




రాజంపేట : డ్వాక్రా మహిళ సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ ఆర్ఎం మహేందర్ అన్నారు. శుక్రవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సంఘాలలో తీసుకున్న శ్రీనిధి రుణాలను సంఘ సభ్యులు సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, శ్రీనిధి మేనేజర్ కిరణ్, సీసీలు సాయిలు, బాగయ్య, రమేష్ తదితరులున్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్ (ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో గురువారం నాటికి 3లక్షల 9వే 453 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణు గోపాల్ రావు తెలిపారు.

బోరు మోటారు బిగింపు



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో ఇటీవల ఎంపీ బీబీ పాటిల్ నిధులతో వేసిన బోరు బావులకు మోటార్లను బిగించి నీటి వసతి కల్పించారు. ప్రజలకు తాగు నీటి సమస్యలేకుండా చూడాలన్నదే ప్రధాన లక్ష్యమని మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాజీ ఉప సర్పంచ్ రవి, విండో చైర్మన్ కమలాకర్ రావు, మండల కో–ఆప్షన్ అల్తాఫ్, పోలీస్ బాల్‌రెడ్డి, పెద్ద నర్సయ్య, బాల్‌రాజు ఉన్నారు.

సంక్షిప్తం

సీఐకి సన్మానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుండెల్లి సాయిలు, మాజీ ఉప సర్పంచ్ దామోదర్ రావుల ఆధ్వర్యంలో నూతనంగా సదాశివనగర్‌కు వచ్చిన సీఐ సంతోష్‌కుమార్‌కు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి పోలీసుస్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్సై వెంకటేశ్వర్లను శుక్రవారం విశ్వబ్రాహ్మణ,-విశ్వకర్మ మండల సంఘం నాయకులు కలిశారు. మండలంలోని పలుగ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణులు కలసి ఎస్సై వెంకటేశ్వర్లను శాలువాలతో సన్మానం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు కమ్మరిరాజు, నాగభూషణం, నర్సిములు, సంతోష్, నాగరాజు, బాలచంద్రం, కృష్ణమూర్తి, భూమయ్య, .దశరత్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్ తదితరులు కలసిన వారిలో ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన పైడాకుల ధర్మపురి ఈ నెల 9వ తేదీన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా వెంటన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా సెల్‌ఫోన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచులు శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని రేపల్లెవాడ, మల్లయ్యపల్లి గ్రామాల మాజీ సర్పంచులు సాయిరాం, ఎల్లయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు సాయిలు, బాలయ్య, దత్తు తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బిచ్కుంద(జుక్కల్) : సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిచ్కుంద బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరగాళ్ల మోసాలపై అవగాహన కల్పించారు. మీ అకౌంట్ నెంబర్లు, ఆధార్‌కార్డుల నెంబర్లు ఫోన్‌చేసి అడిగిన ఇవ్వరాదన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంప్

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం వికలాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఫిజియోథెరపీస్ట్ విశాలాక్షి విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. టీచర్లు కమల్ కిషోర్, గంగాధర్ పాల్గొన్నారు.